క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన


చికిత్స పొందుతున్న ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆస్థాన మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి, వాసన్ ఐకేర్ ఆస్పత్రి వారు సంయుక్తంగా శనివారం ఉదయం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు చికిత్సలు చేసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో పెద్ద ఎత్తున చికిత్స చేసుకున్నారు.

నేడు నగరవనం ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక పెనుమూరు క్రాస్ వద్ద గల నగరవనాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో మయానసేవ ఉత్సవం


మట్టితో తీర్చిన ఇంద్రుడి ప్రతిమ

గుడిపాల: మండలంలో మయానసేవ ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మండలంలోని బొమ్మసముద్రంలో శనివారం అంకాలపరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. మూలస్థానంలో ఉన్న అమ్మవారికి అభిషేకం చేసి, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం అమ్మవారిని ఊరేగించారు. అనంతరం శ్మశానంలో మట్టితో రుద్రుడిని మట్టి ప్రతిమతో తీర్చిదిద్దారు. బొమ్మసముద్రంలో ఉన్న దుర్గాలమ్మ దేవాలయంలో అమావాస్య పూజలు చేశారు. మహిళలు పిండివంటలను రుద్రుడికి నైవేద్యంగా సమర్పించారు. నరహరిపేట చెక్‌పోస్ట్ వద్ద భద్రకాళమ్మ ఆలయంలో అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణోత్సవం


కాళభైరేశ్వర ఆలయంలో వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం

తవణంపల్లె: కాలభైరవేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు చికరాకులపల్లికు చెందిన నందనూరు వంశస్తులచే కల్యాణోత్సవ సేవను భక్తితో నిర్వహించారు. ఉభయదారులు అమ్మ వారికి, స్వామికి సారెలు, పూజాసామిగ్రి, ప్రసాదాలు, పండ్లు, మంగళ సూత్రంను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు పార్వతీపరమేశ్వరులను ప్రత్యేక అలంకరణ చేయించి శాస్త్రోక్తంగా వేద మంత్రాలు పఠనం చేస్తూ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి భక్తులు విశేషంగా విచ్చేశారు. రాత్రి ఉభయదారులు స్వామికి ప్రసాదాలు, సుగంధ పుష్పాలు, పూజాసామగ్రి ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. పల్లకిలో స్వామివారు అశ్వవాహనంపై కొలువుదీరి ఊరేగారు.


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీటీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేతంగా స్వామివారు ఊయ్యాల సేవలో సేదతీరారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం కావడంతో ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి ఊంజల్ మండపానికి వేంచేపు చేసి ఊయలలో కొలువుదీర్చారు. వేద మంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ ఊయ్యాల సేవలో సేదతీరుతున్న స్వామి,అమ్మవార్లను దర్శించి భక్తులు తన్మయులయ్యారు. ఆర్జితం అధికారి భరత్, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతన్న నేస్తాలు

- ఆర్‌బీకేల్లో భూసార పరీక్షలు
- గ్రామాల్లోనే విత్తు నుంచి విక్రయం వరకు
- అన్నదాతలకు తప్పిన అవస్థలు



గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయంలో నూతన శకానికి నాంది పలికాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలో ఎక్కడా లేని విధంగా అన్నదాతలకు గ్రామ స్థాయిలో అన్ని అందుబాటులో ఉండేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 2020 మేలో ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాలను దశలవారీగా బలోపేతం చేశారు. భూసార పరీక్షల నుంచి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించడంతోపాటు ఆర్బీకేలనే కొనుగోలు కేంద్రాలుగా మార్చారు. దీంతో రైతులకు అవసరమైన అన్నిసేవలు ఒకే చోట అందుబాటులోకి వచ్చాయి. దీంతో గతంలో మాదిరి విత్తనాలు, ఎరువుల కోసం, పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు రైతులు అవస్థలు తప్పాయి. వీటితో పాటు రైతులకు ఉచితంగా పంటబీమా కల్పించడం, ప్రకృతి విపత్తులతో పంట నష్టపోతే పరిహారం అందించడంలోనూ ఆర్బీకేలు కీలకంగా మారాయి. మండలంలో వరితో పాటు కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల సాగు కూడా అధికంగా ఉంది. గతంలో రైతులకు విత్తనాలు అవసరమైనా, ఎరువులు కావాలన్నా రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. డిమాండ్ అధికంగా ఉండే సందర్భాల్లో బ్లాక్‌లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చేది. దీంతో రైతులు అల్లాడిపోయేవారు. వరిపంట చేతికి వచ్చిన తరువాత కూడా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి బస్తాలు లేకపోవడం, ప్రభుత్వ సమన్వయం లేకపోవడం తదితర కారణాలతో పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కూడా పొందలేకపోయేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మారుమూల గ్రామాల్లో కూడా ఆర్బీకేలను ఏర్పాటు చేయడంతో రైతులు సొంత గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పొందడం, పండించిన పంట ఉత్పత్తులను దర్జాగా మద్దతు ధరకు అమ్ముకోవడం సాధ్యమైంది. దీంతో గతంలో పోలిస్తే సాగు విస్తీర్ణం కూడా 20 శాతానికి పైగా పెరిగింది.

సేవలు ఇలా...

- ఆర్బీకేల ద్వారా ఏటా రబీ, ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన విత్తనాలను రైతులకు ప్రభుత్వం రాయితీపై అందజేస్తోంది. రబీ సీజన్‌లో అకాల వర్షాలతో నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు 80శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తోంది.
- ధాన్యం విక్రయించేందుకు రైతులు ఇబ్బందులు పడకుండా ఆర్బీకే సిబ్బంది ముందుగానే ఈ–క్రాప్ ద్వారా వారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ క్రాప్‌లో నమోదు చేయడం ద్వారా వారికి మెరుగైన సేవలు అందిస్తున్నారు.
- ఆర్బీకేల ద్వారా రైతు భరోసా, పీఎం కిసాన్, పొలంబడి, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ, పంట బీమా, తదితర సుమారు 20 రకాల సేవలు అందిస్తున్నారు.
- భూసార పరీక్షలు నిర్వహించి శాస్త్రీయ పద్ధతిలో నేల స్వభావాన్ని, సూక్ష్మ, స్థూల పోషకాలను అంచనా వేసి రైతులకు ఎంత మేర ఎరువులు వేయాలి, ఏఏ పంటలు పండించుకోవాలి వంటి విలువైన సూచనలు అందిస్తున్నారు. తద్వారా రైతుల పెట్టుబడి గణనీయంగా ఆదా అవుతోంది. గతంలో భూసార పరీక్షలు చేయాలంటే రైతులకు అసాధ్యంగా ఉండేది. ప్రస్తుతం ఆర్బీకేల సిబ్బంది నేరుగా పొలానికే వచ్చి భూసార పరీక్షలు నిర్వహిస్తుండడం విశేషం.
- ఆర్బీకేల ద్వారా పంటల బీమా కూడా రైతులకు సులభంగా అందుబాటులోకి వచ్చింది. ఆర్బీకేల్లో ఉన్న రైతుల వివరాల ఆధారంగా సిబ్బంది పంటల బీమా చేయించడంతో పాటు ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోతే వెంటనే పరిహారం అందించే అవకాశం లభించింది.
- రైతు భరోసా పథకంతో పాటు ఆర్బీకేల ద్వారా అందించిన సేవలతో గడిచిన నాలుగేళ్లలో 8వేల మంది రైతులకు రూ.65 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు గణాంకాలు చెబుతున్నాయి.
- మండలంలో 17 ఆర్బీకేలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిలో 13 ఆర్బీకేలకు సొంత భవనాలు ఉండగా 4 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఒక్కో ఆర్బీకే నిర్మాణానికి రూ.23.94 లక్షల వంతున ఖర్చు చేసింది. ఈ ఆర్బీకేల్లో ప్రస్తుతం 15 మంది సిబ్బంది రైతులకు సేవలు అందిస్తున్నారు.


రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్న అధికారులు,


రైతులకు వేరుశనగ కాయలు అందజేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

అగచాట్లు తప్పాయి



గతంలో విత్తనాలు, ఎరువుల కోసం అగచాట్లు పడాల్సి వచ్చేది. పనులు మానుకొని దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకుంటే ఇంటివద్దే నాణ్యమైన విత్తనాలు అందజేస్తున్నారు. వ్యవసాయానికి కావలసిన ఎలాంటి సమాచారం అయినా ఆర్బీకే ఉద్యోగులు చెబుతున్నారు. –రామకృష్ణారెడ్డి, రైతు, గుడిపాల

నాణ్యమైన విత్తనాలు ఇస్తున్నారు



రైతు భరోసా కేంద్రంలో నాణ్యమైన విత్తనాలు అందజేస్తున్నారు. దీంతోపాటు మంచి దిగుబడులు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలోల్లో ఎరువులు అందిస్తున్నారు. భూసార పరీక్షలు చేస్తున్నారు. యూరియాను బ్లాక్‌లో కొనే దారుణమైన పరిస్థితి లేకుండా, ఎమ్మార్పీకే అందజేస్తున్నారు. –శ్రీరాములు, రైతు, గుడిపాల

నేడు కొటాలలో వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ

యాదమరి: మండలంలోని కొటాల గ్రామంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త బీఎంఆర్ మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. కొటాల గ్రామంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. దీనికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్ హాజరు కానున్నట్లు వివరించారు. దీనికి మండలంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు అందరూ హాజరుకావాలని కోరారు.

కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఎంహెచ్‌వోగా చిన్నయ్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారి (ఎంహెచ్‌వో)గా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.చిన్నయ్యకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ అరుణ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంహెచ్‌వోను ఇటీవల ఆయన్ను మాతృశాఖకు సరెండర్ చేయడంతో, ఆ స్థానంలో చిన్నయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ల్యాప్‌టాప్ వితరణ

గుడిపాల: మండలంలోని బండపల్లె ప్రాథమికోన్నత పాఠశాలకు ల్యాప్‌టాప్‌తోపాటు ప్రింటర్‌ను అందించారు. అదే గ్రామానికి చెందిన రామచంద్రయ్య, మునిలక్ష్మి దంపతుల వివాహదినోత్సవం సందర్భంగా విరాళంగా అందజేశారు. దీనికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఈఓలు రామ్‌నాయక్, గణపతి మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం దాతలు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు విజయశేఖర్, రూపావతి పాల్గొన్నారు.

జగనన్నకు జనమే అండాదండ


కామాలూరులో ప్రచారం చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: కుల మతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందించే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలే అండాదండ అని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఈచనేరి, కామాలూరు, ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో, కారకాంపల్లె పంచాయతీ గ్రామాల్లో శనివారం డాక్టర్ సునీల్‌కుమార్, మండల పార్టీ నేతలతో కలసి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని వివరించారు. సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికి అందాలంటే ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తేవాలని కోరారు. జగన్‌మోహన్ రెడ్డి మరోసారి సీఎం అయితేనే ప్రజలకు మేలు కలుగుతుందని వివరించారు. ప్రతిపక్షాలన్నీ ఒక్కటైనా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ప్రజల గురించి ఆలోచించే జగనన్నను ప్రతి ఒక్కరు ఆశీర్వదించాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు హరిరెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు జి.ప్రకాష్‌రెడ్డి, గాంధీబాబు, పూర్ణారెడ్డి, హరికృష్ణారెడ్డి, రవిరెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, పరమేశ్వరరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, మధుకుమార్, భాస్కర్‌నాయుడు, సుజిత్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, శివాజీరెడ్డి, చంద్రబాబు, కోదండ, హరీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందాం


బంగారుపాళెంలో సీఎం సందేశం లేఖను అందజేస్తున్న కుమార్‌రాజా

బంగారుపాళెం: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు సిద్ధమవుదామని రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. మండలంలో శనివారం 'చెప్పాడంటే చేస్తాడంతే' సర్వే కార్యక్రమాన్ని వలంటీర్లు నిర్వహించారు. ఇందులో కుమార్‌రాజా మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతి ఇంటికీ వెళ్లి అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ సర్వే చేపట్టిందన్నారు. వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలో ప్రతి ఇంటినీ సందర్శించి, గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ సీఎం సందేశంతో కూడిన లేఖను అందించాలన్నారు. నవరత్న పథకాల లబ్ధి, వలంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థ, జగనన్న ఆరోగ్య సురక్ష, నాడు–నేడు, పాఠశాలల్లో ఇంగ్లిష్, వంటి పథకాలు కొనసాగేందుకు జగనన్నకు మద్దతు ఇవ్వడానికి సిద్ధమా అనే విషయాన్ని సర్వే నిర్వహించి పక్కాగా యాప్‌లో నమోదు చేయాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉమాదేవి, ఉపసర్పంచ్ కామరాజు, ఎంపీటీసీ ఉష, గృహసారథులు, పంచాయతీ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నందీశ్వరా.. మణికంఠేశ్వరా


నంది వాహనంపై మణికంఠేశ్వర స్వామి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ మణికంఠేశ్వర స్వామి దేవస్థానంలో రాత్రి లింగోద్భవ అభిషేకం నిర్వహించి, స్వామివారిని అధికార నంది వాహనంపై ఊరేగించారు. శుక్రవారం రాత్రి మణికంఠేశ్వర స్వామి ఆలయంలో లింగోద్భవ అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం ఉదయం మణికంఠేశ్వర స్వామిని అధికార నంది వాహనంపై కొలువుతీర్చి పుర వీధులలో ఊరేగించారు.

ఓటర్లు విజ్ఞతతో ఓటేయండి


సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల సమయంలో టీడీపీ–జనసేన పొత్తుతో కలిసి ప్రజలను ఏమార్చడానికి వస్తోందని చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. శనివారం 9వ డివిజన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా చిత్తూరులో మాజీ ఎమ్మెల్యేలు, పలువురు నాయకులు గెలుపు కోసం కుట్రపన్నుతున్నారన్నారు. ఇన్ని రోజులు వారికి ప్రజాసమస్యలు గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. జగనన్న దయతో స్థానిక నాయకుల సహకారంతో ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి ఇప్పుడు వైఎస్సార్‌సీపీని విమర్శించడం సరికాదన్నారు. స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవ చేసేవారిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఫ్యానుకు ఓటువేసి గెలిపించాలని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, నాయకులు జగస్, జస్టిన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అందజేశారు. గుడిపాల మండలం కుప్పిగానిపల్లెకు చెందిన గోవింద్ గుండెసమస్యతో బాధపడుతున్నారు. వీరికి రూ.50 వేలు చెక్కును విజయానందరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కుప్పిగానిపల్లె సర్పంచ్ మధుసూదన్‌రాయల్ పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి

మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట

చిత్తూరు రూరల్: ముస్లిం మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని సంతపేటలో శనివారం మసీదు కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ముందస్తుగా రంజాన్ తోఫా పంపిణీ చేశారు. మసీదుల అభివృద్ధి, రంజాన్ ఏర్పాట్ల నిమత్తం నగదు చెక్కును అందజేశారు. రానున్న ఎన్నికల్లో వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్‌నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.

శ్మశానకొల్లకు జన జాతర

- శ్రీ అంకాళ పరమేశ్వరికి అభిషేక పూజలు
- సంప్రదాయబద్ధంగా దక్షసంహారం
- వీక్షించిన అశేష జనం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో శనివారం శ్మశానకొల్ల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంకాళపరమేశ్వరికి అభిషేక, పూజలు చేశారు. ముందుగా అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి నీవానది ఒడ్డుకు చేర్చారు. సంప్రదాయబద్ధంగా శ్మశానకొల్ల ఉత్సవాన్ని ముగించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు జనం జాతరలా తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతం జనసంద్రంగా మారింది.

ఏటా శివరాత్రి మరుసటి రోజే

ప్రతి ఏటా శివరాత్రి మరుసటి రోజు నిర్వహించే శ్మశానకొల్ల(మయానసేవ)ను ఈసారి కూడా అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా గుర్రప్ప నాయుడువీధి, గిరింపేటలోని అంకాళపరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ప్రభపై అమ్మవారిని అధిష్టింపజేసి నీవానది ఒడ్డున ఏర్పాటు చేసిన శ్మశానకొల్ల మైదానానికి తీసుకొచ్చారు. ముందుగా శ్మశానకొల్ల మైదానంలో మట్టితో భారీ దక్షుడి ప్రతిమను తీర్చిదిద్దారు. అంకాళపరమేశ్వరి అమ్మవారు మైదానానికి చేరుకోవడంతో అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. అమ్మవారు దక్షుడి ప్రతిమ చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో దక్ష సంహారం పూర్తయింది. భక్తులు ఆ మట్టి కోసం ఒక్కసారిగా ఎగబడ్డారు. ఈక్రమంలో పలువురు మహిళలు పూనకంతో ఊగిపోయారు. ఈసారి కూడా తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వచ్చారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతను కల్పించారు.


శ్మశానకొల్లలో అమ్మవారు

191 ఏళ్లుగా సేవ..

అంకాళపరామేశ్వరి ఆశీస్సులతో బెస్తకులస్తులు ఈ మయాన సేవను 191 ఏళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నట్లు ఉత్సవ, ఆలయ ట్రస్టు చైర్మన్ కేఎం కుమార్ తెలిపారు. తమిళనాడుకు ప్రత్యేకంగా చెప్పుకునే ఈ ఉత్సవాన్ని ఏళ్ల తరబడి చిత్తూరులో కూడా అత్యంత వైభవంగా జరిపిస్తున్నట్లు చెప్పారు. అమ్మవారి ఆశీస్సులు, దక్షుడి మట్టి కోసం భక్తులు తీసుకుని మంచి జరుగుతుందని భావిస్తారని తెలిపారు.


దక్షుడి మట్టికోసం ఎగబడుతున్న జనం


శ్మశానకొల్లలో జనం సందడి


మట్టితో తీర్చిదిద్దిన దక్షుడి ప్రతిమ

రావణబ్రహ్మపై ఆదిదంపతులు



రావణబ్రహ్మపై ఊరేగుతున్న శివపార్వతులు, వృషభ వాహనంపై పార్వతీ పరమేశ్వరులు

బంగారుపాళెం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం ఉదయం ఆదిదంపతులైన శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి కైలాసగిరి రావణబ్రహ్మ వాహనంపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీస్వామి, అమ్మవారి మూలవిగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి రావణ బ్రహ్మ వాహనంపై కొలువుదీరారు. స్వామి, అమ్మవారికి భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవానికి బెంగళూరుకు చెందిన సుధారాణి, వెంకటరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి శేషవాహనంపై స్వామి, అమ్మవారు ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమానికి కొండేటివాండ్లవూరుకు చెందిన సుమతి, రంగనాథంనాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. శుక్రవారం రాత్రి పార్వతీపరమేశ్వరుడు వృషభవాహనాన్ని అధిరోహించి భక్తజనులను కనువిందు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరింపజేసి వృషభ వాహనంపై స్వామివారు విహరించారు. ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

నేడు గజవాహన సేవ..

మొగిలీశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గజవాహనం, రాత్రి కామధేనువాహన సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజు తెలిపారు.